# నా గెలుపు..కాంగ్రెస్ ఓటమి రెండూ హ్యాట్రిక్కే

- కాంగ్రెస్, బీజేపీలకు స్థానం లేదు
- బీఆర్ఎస్‌పైనే ప్రజలకు విశ్వాసం
- మంత్రి చామకూర మల్లారెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో కలిసి విజయ సంకేతం చూపిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, అక్టోబర్ 27 : గెలుపులో తాను హ్యాట్రిక్ కొట్టబోతుంటే... కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిలో హ్యాట్రిక్ కొట్టబోతున్నారంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో బీఆర్ఎస్ నేత రామన్నగారి రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంపీగా ఒకసారి, ఆ తర్వాత ఎమ్మెల్యేగా గెలుపొంది, మంత్రి అయిన తాను ఈ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధిస్తానని, కాంగ్రెస్ అభ్యర్థి జంగయ్య యాదవ్ రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి, ఓడిపోయారని, మరోసారి ఓటమికి సిద్ధం అవుతున్నాడన్నారు. విశ్వాసానికి, నమ్మకానికి మారుపేరు బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని, దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ పథకాలు అమలు చేశాయా? అని అన్నారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీయించిందన్నారు. 24 గంటల కరెంట్ కాదు కదా కనీసం 6 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో వ్యవసాయాన్ని అధోగతి పాలు చేస్తుందని తెలిపారు. మేడ్చల్ ప్రజలు రేవంత్ రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు ఒకసారి కూడా ముఖం చూపించలేదని, అభివృద్ధికి నిధులు ఇవ్వలేదన్నారు. కానీ పీసీసీ అధ్యక్ష పదవి కొనుక్కొని, ఇప్పుడు ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకున్నాడని మంత్రి ఆరోపించారు. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పార్టీ నాశనం అవుతుందని, టీడీపీ రాష్ట్రంలో లేకుండా చేశారని, ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కూడా ఉండదని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సాయిరాం, రాము, శ్రీధర్, బుచ్చమ్మ, వినయ్‌తోపాటు 200 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేశారు. వారందరికి మంత్రి బీఆర్ఎస్ కండువాకప్పి పార్టీకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, బీఆర్ఎస్ నేతలు రాఘవేందర్ గౌడ్, మర్రి నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న బీఎస్పీ నేతలకు పార్టీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నేతలు

శామీర్‌పేట, అక్టోబర్ 27 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న పథకాలకు, అభివృద్ధికి ఆకర్శితులై కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల నుంచి పెద్దఎత్తున వలసలు మొదలయ్యాయని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన బీఎస్పీ సయ్యద్ హైమద్, బీర్కురి జహంగీర్, కైర గణేశ్‌లతో పాటు 15 మంది బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే ఘన విజయం సాధిస్తుందన్నారు. అనంతరం లాల్‌గడి మలక్‌పేటలో పర్యటించిన మంత్రి ముస్లిం సోదరులతో కలిసి మజీద్ వద్ద మాటామంతి నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుస్తామని, గెలుపును కాంక్షిస్తూ మంత్రికి మిఠాయి తినిపించి ముందుగానే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లూభాయి బాబు, జడ్పీటీసీ అనితాలాలయ్య, వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సతీశ్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జహీరుద్దిన్, సర్పంచ్ వనజశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఇందిరా రాజిరెడ్డి, మైనార్టీ సోదరులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికే మళ్లీ పట్టం : బీఆర్ఎస్ నాయకుడు భద్రారెడ్డి



ఏదులాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న భద్రారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 27 : మంత్రి మల్లారెడ్డి చేసిన అభివృద్ధికి ప్రజలు మళ్లీ పట్టం కట్టనున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చామకూర భద్రారెడ్డి తెలిపారు. మండల పరిధి ఏదులాబాద్‌లో శుక్రవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్ధే కర్తవ్యంగా నిరంతరం పని చేసిన మంత్రి మల్లారెడ్డిని నాయకులు, కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల ఆర్థిక, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చాలని సూచించారు. మల్లారెడ్డి దవాఖానలో నియోజకవర్గంలోని పేదలందరికీ ఉచిత వైద్యం అందించి ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ సురేశ్, సహకార సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఉత్సాహంగా పండుగలు

మేడ్చల్ రూరల్, అక్టోబర్ 27 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అన్ని మతాల పేద ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకుంటున్నారని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో ముస్లిం సోదరులు నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జడ్పీటీసీ శైలజా విజయనందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, సర్పంచ్‌లు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, సర్పంచ్‌లు శ్యామల ప్రభాకర్‌రెడ్డి, కవితా జీవన్, ఉప సర్పంచ్ శివలక్ష్మి, డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేశ్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి గెలుపు ఖాయం

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 27 : మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నాగారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందని, మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. తెలంగాణాలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉందని, కేసీఆర్ విజయానికి అందరూ సహకరించాలని కోరారు.



కారుగుర్తు ఓటేసి మల్లారెడ్డినే గెలిపించాలని బోడుప్పల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మేయర్ బుచ్చిరెడ్డి స్థానిక నాయకులు

## మంత్రి మల్లారెడ్డికి గులాబీదండు మద్దతు

బోడుప్పల్, అక్టోబర్ 27 : కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన మంత్రి మల్లారెడ్డిని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తిరిగి భారీ మెజార్టీతో గెలిపించాలని మేయర్ సామల బుచ్చిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు శక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగర పరిధిలోని 28 డివిజన్లలో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారంలో కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, చందర్‌గౌడ్, లక్ష్మీరవిగౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కాటపల్లి లతారాంచంద్రారెడ్డి, బొమ్మక్ సుగుణబాలయ్య, శ్రీవిద్యచక్రపాణిగౌడ్, సుమన్‌నాయక్, మహేశ్వరి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిగీతాశ్రమంలో మంత్రి పూజలు



సాయిగీతాశ్రమంలో మంత్రి మల్లారెడ్డి దంపతులను సత్కరించిన ఆశ్రమ వ్యవస్థాపకులు సాయికుమార్ బాబా

మేడ్చల్ రూరల్, అక్టోబర్ 27: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయ శివారులోని సాయిగీతాశ్రమంలో శుక్రవారం కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమానికి విచ్చేసిన మంత్రికి ముందుగా ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమ మర్యాదలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు సాయికుమార్ బాబా ఆధ్వర్యంలో ఆయన సూచన మేరకు ఆశ్రమంలోని రుద్రాక్ష, జంబి, మర్రి చెట్లకు ప్రదక్షిణలు నిర్వహించి, అక్కడున్న దేవతలకు మంత్రి పూజలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగించి అధికారంలోకి రావాలని, సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి హ్యాట్రిక్ కొట్టాలని పూజలు చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం మంత్రిని సాయికుమార్ బాబ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ కమిటీల ఏర్పాటు



సేదోనిగడ్డ తండాలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యులతో మండల పార్టీ నాయకులు

మేడ్చల్ రూరల్, అక్టోబర్ 27 : మేడ్చల్ మండలంలోని సైదోనిగడ్డ తండా, సోమారం గ్రామంలో బీఆర్ఎస్ బూత్ కమిటీలను శుక్రవారం ఏర్పాటు చేశారు. మండల పార్టీ నాయకులు గ్రామాల్లో సమావేశం నిర్వహించి క్షేత్ర స్థాయిలో పని చేసే కార్యకర్తలను గుర్తించి బూత్ కమిటీలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు విజయనందరెడ్డి, డబిల్‌పూర్ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, పూడూర్ సొసైటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై మండిపడ్డ మహిళా కార్పొరేటర్లు



ప్రీతిరెడ్డిపై రాపోలు రాములు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్న డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, మహిళా కార్పొరేటర్లు

బోడుప్పల్, అక్టోబర్ 27 : మంత్రి మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డిపై కాంగ్రెస్ నాయకులు రాపోలు రాములు సంస్కారహీనంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, మహిళా కార్పొరేటర్లు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రీతిరెడ్డిపై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మంత్రికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్న ప్రీతిరెడ్డిని మానసికంగా దెబ్బతీసేలా రాపోలు రాములు మాట్లాడడం తగదని, త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు డి. మహేశ్వరి, బొమ్మక్ సుగుణమ్మ, లావణ్యాశేఖర్‌రెడ్డి, హేమలతజంగారెడ్డి, 15వ డివిజన్ ఇన్‌చార్జి చిగురు రేణుక పాల్గొన్నారు.